సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

పిల్లలకు ఆటపాటలూ ముఖ్యం



డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను సత్కరిస్తున్న విజయారెడ్డి, ఎస్వీ రెడ్డి

మురళీనగర్: పిల్లలకు విద్యతోపాటు ఆటపాటల్లో పాల్గొనేందుకు సమయం కేటాయించాలని తల్లిదండ్రులకు జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సూచించారు. మురళీనగర్‌లోని హ్యాపీ ఫీట్ ప్రీస్కూల్ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పిల్లలతో సమయం గడిపేందుకు తల్లిదండ్రులిద్దరూ ప్రాధాన్యమివ్వాలన్నారు. చైల్డ్ సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎస్.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక వికాసం పెంపొందించేందుకు ఆహ్లాదకర వాతావరణంలో పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, డాక్టర్ ప్రసన్నకుమార్‌లను పాఠశాల డైరెక్టర్ ఎస్.విజయారెడ్డి, ఎస్వీ రెడ్డి ఘనంగా సత్కరించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యాచకుడి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని యాచకుడు

గోపాలపట్నం: గుర్తు తెలియని యాచకుడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గోపాలపట్నం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా .. గోపాలపట్నం బంక్ సెంటర్‌లో సుమారు 60 ఏళ్ల ఉండే గుర్తు తెలియని యాచకుడిని శనివారం ఉదయం ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గోపాలపట్నం పోలీసులు చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు 9440796020, 9603750151, 9441262356 నంబర్లకు సమాచారమివ్వాలని గోపాలపట్నం పోలీసులు కోరారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు గౌరీనగర్‌లో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దాసరి శామ్యూల్ ఆధ్వర్యంలో ఆదివారం పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆడారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని కోరారు. భవిష్యత్తుకు మంచి పునాది టెన్త్ అని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ పల్లా ఎర్నికుమార్ యాదవ్, పార్టీ నాయకురాలు సర్వసిద్ధి సాయిలత పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో భారీ అన్న సమారాధన



సీతారాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు శ్రీహరిపురంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆదివారం మధ్యాహ్నం నిర్వహించిన భారీ అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు నాయకులు శ్రీను,గ్రామ కమిటీ సభ్యులు నర్సింగరావు,గున్న,సమ్మిడి శ్రీను,కన్నబాబు,బుజ్జి,నానాజీ పాల్గొన్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

వైజాగ్ వెస్ట్
9398184202, 9912440606

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచే పరీక్షలు



ఆర్పీపేట పాఠశాల ప్రధాన ద్వారం...



భాష్యం పాఠశాలలో సిట్టింగ్ నమూనా



ఆర్పీపేట ఉన్నత పాఠశాలలో రోల్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

మల్కాపురం: పదో తరగతి పరీక్షల నిర్వహణకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల హాల్ టికెట్ల నంబర్లతో రూమ్‌లు సిద్ధం చేశారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించారు. విద్యార్థులకు కేటాయించిన సెంటర్లకు అరగంట ముందే చేరుకోవాలని అధికారులు సూచించారు.ఒక నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఐదు సెంటర్లలో 1200 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఇప్పటికే ఫ్యాన్లు మంచినీటి సౌకర్యం,సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

పారిశ్రామిక ప్రాంతంలో పరీక్ష సెంటర్లు ఇవే

1.మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల
2.గాంధీగ్రాం జీవీఎంసీ ఉన్నత పాఠశాల
3.శ్రీహరిపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల
4.శ్రీహరిపురంలోని సరస్వతీ విద్యా విహార్ పాఠశాల
5. శ్రీహరిపురంలోని భాష్యం పాఠశాల

మౌలిక వసతులు

కంచరపాలెం: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. రోల్ నంబర్ల వారీగా రూమ్‌లను కేటాయించారు. గోపాలపట్నం, ఎన్ఏడీ కొత్తరోడ్డు , కంచరపాలెం, రామ్మూర్తిపంతులపేట కప్పరాడ, భాష్యం, శ్రీచైతన్య, రామకృష్ణ, బాలాజీ, డీఏవీ, గోపాలపట్నం జెడ్పీహెచ్ బాయ్స్, బాలికల ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మౌలిక వసతులైన విద్యుత్ దీపాలు,ఫ్యాన్లు, మరుగుదొడ్లు సిద్ధం చేశారు.

- జ్ఞానాపురంలోని సెక్రెడ్‌హార్ట్ బాలికోన్నత పాఠశాల, సెయింట్‌పీటర్స్ బాలుర ఉన్నత పాఠశాల, జూబ్లీ ఇంగ్లిస్ మీడియం పాఠశాల, ఐటీఐ కూడలిలోని కప్పరాడ ఉన్నతపాఠశాల, కరాసలో స్టెల్లామేరీస్ ఇంగ్లీషు మీడియం స్కూల్, ఎన్ఏడీ కొత్తరోడ్డులో రామకృష్ణ పబ్లిక్ స్కూల్, ఎన్ఏడీ శ్రీచైతన్య స్కూల్లో కేంద్రాలు సిద్ధమయ్యాయి.

పరీక్షా కేంద్రం	పరీక్ష రాయనున్న విద్యార్థులు
ఆర్పీపేట ఉన్నత పాఠశాల	192
కప్పరాడ ఉన్నత పాఠశాల	168
ఏఎన్‌ఏడీ రామకృష్ణ	177
చైతన్య	220
చైతన్య శాంతినగర్	220
బాలాజీ పాఠశాల	200
డీఏవీ	220
గోపాలపట్నం(బాలురు)	250
గోపాలపట్నం (బాలికలు)	220

సవాళ్లు విసురుతున్న సాంకేతిక మార్పులు



ప్రసంగిస్తున్న కామత్ ,హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మారుతున్న సాంకేతికత.. ఉపాధి అవకాశాల కల్పనలో సవాళ్లు విసురుతోందని విప్రో సంస్థ హెచ్‌ఆర్ విభాగం జీఎం కె.ప్రవీణ్ కామత్ అన్నారు. ఆదివారం ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ విద్యార్థులను ఉద్దేశించి కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో ప్రత్యేక ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బహుళ నైపుణ్యాలు కలిగి ఉండాలని సూచించారు. భవిష్యత్తులో నూతనంగా అవతరించే ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాలను కలిగి ఉండాల్సిన విధానాలను తెలియజేశారు. హెచ్‌ఆర్ రంగంలో వస్తున్న నూతన పోకడలు, అవకాశాలు వివరించారు. ఉద్యోగాలకు సన్నద్ధమయ్యే విధానం, ప్రణాళిక, అనుసరించాల్సిన వ్యూహాలను తెలియజేశారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలలో 85 శాతానికి పైగా రానున్న రెండు దశాబ్దాల కాలంలో కనుమరుగవుతాయన్నారు. అధునాతన సాంకేతికతను మిళితం చేస్తూ అభ్యసనం చేసే వారికి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ రంగంలో విద్యార్థులకు ఎదురయ్యే సవాళ్లను ప్రత్యక్షంగా తెలియజేయడానికి ఈ ప్రత్యేక ప్రసంగాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, డాక్టర్ ఎస్.కె.ప్రసాద్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈవో రవి ఈశ్వరపు, ఏయూ సిట్ ఏవో డాక్టర్ సారాబంది, తదితరులు పాల్గొన్నారు.

భారీ అన్నసమారాధన

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దయానందనగర్‌లో వెలసిన నూకాంబిక అమ్మవారి వేడుకల్లో భాగంగా వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆర్థిక సాయంతో ఆలయ ఆవరణలో ఆదివారం భారీ అన్నదానం నిర్వహించారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆడారి శ్రీను, మజ్జి నూకరాజు, గ్రామాధ్యక్షుడు డి.అప్పలరాజు అన్నసమారాధనను ప్రారంభించారు. సుమారు 5వేల మంది అన్న ప్రసాదాలు స్వీకరించారని గ్రామ కార్యదర్శి బోని ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పి.రాజు, వి.రాజు, కె.నూకరాజు, ఎం. కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు డి.ఎస్.మణికంఠ, వి.ప్రసాద్, ఎం.కార్తీక్, ఎం.ముత్యాలమ్మ, కాంతమ్మ. పి.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

గోపాలపట్నం సీఐ బదిలీ

గోపాలపట్నం: గోపాలపట్నం పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ సతీష్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఈదుల నరసింగరావు సోమవారం బాధ్యతలు తీసుకుంటారని సమాచారం. నరసింగరావు గతంలో ఇదే స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు.

రసవత్తరంగా గ్రామాధ్యక్షుడి ఎన్నిక

- చివరి వరకూ ఉత్కంఠ
- గుణేశ్వరరావుకు పట్టం కట్టిన దుర్గాపురం గ్రామస్తులు



పోలింగ్ కేంద్రంలో ఎన్నికల కమిటీ సభ్యులు, ఏజెంట్లు



ఓటు వేసేందుకు క్యూలో గ్రామస్తులు



ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న గుణేశ్వరరావు

గోపాలపట్నం: అదో చిన్న గ్రామం.. అయితే ఆ గ్రామ కమిటీ ఎన్నికలు మినీ సంగ్రామాన్ని తలపించింది. డబ్బు, మద్యంఏరులై పారింది. ప్రజలు మాత్రం నిజాయితీకే పట్టం కట్టారని గెలిచిన నాయకులు చెబుతున్నారు. దుర్గాపురం కమ్యూనిటీ హాలులో ఉదయం 8 గంటల నుంచి మొదలైన ఎన్నికల హడావుడి సాయంత్రం వరకు కొన సాగింది. మధ్యలో భోజనాల కోసం ఎన్నికల ప్రక్రియకు 30 నిముషాల పాటు విరామం ఇచ్చారు. ఎన్నికల కమిటీ సభ్యులు, అభ్యర్థులు ఒకే చోట భోజనాలు చేశారు. ఇది వారి నిబంధన. భోజనాల అనంతరం తిరిగి 2 గంటలకు ప్రారంభమైన ప్రక్రియ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగింది.

అంతా సందడి

ఉదయం నుంచి పోలీసులు బందో బస్తు ఏర్పాట్లు చేశారు. గ్రామమంతా ఈ ఎన్నికలతో సందడిగా మారింది. విజయం ఎవరికి వరిస్తుందోనని చర్చలు కనిపించాయి. సాయంత్రం 5.15కు ఎన్నికల లెక్కింపు మొదలైంది. 5.45గంటలకు లెక్కింపు ముగిసింది. 715 ఓట్లు పోలవ్వగా గుణేశ్వరరావుకు-325, గోవిందుకు-295, హేమలతకు 95 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల కమిటీ గుణేశ్వరరావు గ్రామాధ్యక్షుడిగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే గెలిపించాయన్నారు. గ్రామాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. గుణేశ్వరరావు అభిమానులు భారీ ఊరేగింపు చేపట్టారు.

నేడు పోలమాంబ తొలేళ్ల ఉత్సవం

- అనుపు మహోత్సవం రేపు
- భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు



ఆలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లు



విద్యుత్ దీపాలతో పోలమాంబ ఆలయం

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి పండగ మహోత్సవాలలో భాగంగా సోమవారం తొలేళ్ల సంబరం జరగనుంది. స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద తొలేళ్ల ఉత్సవాలు జరపనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అనుపు మహోత్సవం జరగనుంది. ఈ రెండు రోజులూ అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో డి.వి.ఎస్. సురేష్‌బాబా తెలిపారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయం నుంచి పెదవాల్తేరుకు వెళ్లే రోడ్డు మార్గాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం జరిగే ప్రధాన పండగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పిడింట్ల శంకర్‌రెడ్డి తెలిపారు. చలువ పందిరి, ఆలయ ప్రాంగణంలో టెంట్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు వివిధ క్యూలైన్లను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రవేశాలు కల్పించనున్నారు. భక్తులకు మజ్జిగ, మంచినీరు, పిల్లలకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేయనున్నట్టు చైర్మన్ తెలిపారు. భక్తులకు ఉచిత దర్శనంతో పాటు రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంటాయన్నారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. తొలిపూజ, పంచామృతాభిషేకాలకు రూ.1516 చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

వివాహిత ఆత్మహత్య

ఆరిలోవ: మనస్తాపంతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఆరిలోవ సీఐ సోమశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోటగరువు సమీప గాంధీనగర్‌లో వాసుపల్లి వరలక్ష్మి(47), భర్త ఉమాపతి నివాసముంటున్నారు. వీరికి పిల్లలు లేరు. ఉమాపతి రిటైర్డ్ డాక్‌యార్డ్ ఉద్యోగి. వరలక్ష్మి చీరల వ్యాపారం చేసేది. చీరలు అరువు పద్ధతి విక్రయించేంది. ఈ డబ్బులు వసూలు కాకపోవడంతో వ్యాపారంలో నష్టం వచ్చింది. ఆర్థిక ఇబ్బందులకు గురైంది. దీనికి తోడు ఆరోగ్యం కూడా బాగోకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉమాపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కేజీహెచ్‌కు తరలించారు.

ఘనంగా మట్టల ఆదివారం



లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో ర్యాలీగా వెళుతున్న సేవియర్ లూథరన్ చర్చి సభ్యులు



జయప్రకాష్‌నగర్‌లో ఎరుసలేమ్ చర్చి సభ్యుల ర్యాలీ

- ఈత మట్టలకు పువ్వులు గుచ్చి ఊరేగింపు

గోపాలపట్నం: గోపాలపట్నం, ఎన్ఏడీ ప్రాంతాల్లో మట్టల ఆదివారం సందడిగా జరిగింది. చిన్నారులు, పెద్దలు కలసి ఈత మట్టలకు పువ్వులు గుచ్చి ర్యాలీ చేపట్టారు. ఈ పండగ గుడ్ ఫ్రైడేకు ముందు నిర్వహించడం ఆనవాయితీ. దావీదు కుమారుడా నీకు జయము అంటూ నినాదాలు చేశారు. జయప్రకాష్‌నగర్ ఎరుసలేమ్ ప్రార్థన మందిరం సంఘ కాపరి సిస్టర్ పిస్ ఏంజిల్ బ్లెస్సీ ఆధ్వర్యంలో సభ్యులు సండే స్కూల్ పిల్లలు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్, బాజీ జంక్షన్ ఎన్ఏడీ ప్రాంతాల్లో ఊరేగించారు.

- లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ సేవియర్ లూథరన్ చర్చి పాస్టర్ రెవరెండ్ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు యువజనులు, సండే స్కూల్ పిల్లలు ఊరేగింపులో పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

తాగునీరు వృథా



పైప్‌లైన్ లీకై వృథాగా పోతున్న నీరు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలోని కృష్ణ రెస్టారెంట్ అండ్ బార్ వద్ద తాగునీటి పైపులైన్ దెబ్బతింది. వారం రోజుల నుంచి ఇక్కడ నీరు వృథాగా పోతుంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి తాగునీరు వృథాను అరికట్టాలి. -గుప్తా, మల్కాపురం

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు

పెదగంట్యాడ: స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం ఇల్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉక్కు నిర్వాసిత కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సమతానగర్‌లో యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లోని ఎనిమిది డిపార్టుమెంట్లలో పని చేస్తున్న నిర్వాసిత కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే పని కల్పించాలని కోరారు. అలాగే వారికి ఉక్కు యాజమాన్యం నేరుగా జీతాలు చెల్లించాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించని శ్రద్ధా, కళింగ కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంట్రాక్టర్లు చెల్లించిన డబ్బులను యాజమాన్యం అట్టే పెట్టుకోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. తక్షణమే ఫైనల్ బెనిఫిట్స్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు భద్రత కల్పించాలని, ప్రమాదశాత్తూ ఎవరైనా మరణిస్తే రూ.20లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొడ్డు పైడిరాజు, కండేపల్లి రాజు, కె వేణుగోపాల్‌రెడ్డి, వి.సన్యాసిరావు, గొందేశివేణురెడ్డి, పేర్ల నూకరాజు, వెంకీ నాయుడు, అప్పలరాజు, రమణ, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

‘ఉద్యోగాల పేరిట బీజేపీ మోసం’



ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ ఎస్.మధురెడ్డి

మద్దిలపాలెం: ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి కేంద్రంలో గద్దెనెక్కిన బీజేపీ యువతను మోసం చేసిందని ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ ఎస్.మధురెడ్డి ఆరోపించారు. మద్దిలపాలెంలోని ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వస్తే యువతకు సంవత్సరం కాలం వ్యవధిలో రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రధాని మోదీ ఇచ్చిన హామీ నెరవేరలేదన్నారు. వంద రోజుల్లో నిత్యావసర వస్తువులు ధరలను తగ్గిస్తామని నమ్మబలికారన్నారు. ప్రతి పేదవాడి అకౌంట్లో రూ.15లక్షలు వేస్తామని మోసం చేశారని విమర్శించారు. ఉద్యోగాల భర్తీ చేసే వరకూ యువతరం పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు కెల్లా రమణ, బన్ని, తేజా, నిశాంతు, వినయ్, కిరణ్, వైకుంఠరాజు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తులు రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న శ్రీ సత్యసాయిబాబా భక్తులు

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అత్యవసర రోగులకు అందించేందుకు వీలుగా ఈ శిబిరాల ద్వారా రక్తాన్ని సేకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. ఎంవీపీ కాలనీలోని శ్రీసత్యసాయి ప్రేమ సదన్‌తో పాటు బీహెచ్‌పీఈఎల్ ప్రాంతంలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా శిబిరాల ద్వారా ఎన్టీఆర్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంకులు వంద యూనిట్ల రక్తాన్ని సేకరించాయి. ఈ కార్యక్రమంలో శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొని రక్తదాతలను అభినందించారు.

శాంతి కోసం సైకిల్ యాత్ర



సైకిల్‌పై సబ్బవరం చేరుకున్న విజయ్ గోపాలకృష్ణ

సబ్బవరం: దేశంలో శాంతి నెలకొల్పాలని,ఘర్షణలు లేకుండా చూడాలని ప్రార్థిస్తూ ఆయన దేశంలోని పలు రాష్ట్రాలను చుట్టేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లోని ప్రముఖ ఆలయాలను దర్శించుకుని దేవుళ్లను ప్రార్థిస్తున్నారు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్ జిల్లా సింధునూరు పట్టణానికి చెందిన విజయ్ గోపాలకృష్ణ. గతేడాది మార్చి 11వ తేదీన సింధునూర్‌లో ఈ యాత్ర ప్రారంభించారు. అక్కడ నుంచి బయలదేరి దాదాపు 11 రాష్ట్రాలను చుట్టేశారు. ఉదయం పర్యటన మెదలు పెడుతూ మధ్యాహ్నం కాస్త విశ్రాంతి తీసుకుంటూ అనంతరం మళ్లీ ప్రమాణం సాగిస్తున్నారు.ఇప్పటివరకూ ఘనాపూర్, తుల్జాపూర్,షిర్డీ,నాసిక్,త్రయంభకేశ్వరం,గుజరాత్ రాష్ట్రంలోని నర్మదానది,నాందేడ్,తో పాటు విజయవాడ కనకదుర్గమ్మ,అన్నవరం సత్యనారాయణను దర్శించుకున్నారు. సబ్బవరం మీదుగా శ్రీకాకుళంలోని సూర్యనారాయణ స్వామిని దర్శించుకోనున్నారు. యాత్రలో భాగంగా ఆదివారం సాయంత్రం సబ్బవరం చేరుకున్నారు. సబ్బవరంలోని శ్రీకృష్ణమందిరంలో రాత్రి బస చేశారు.యధావిధిగా సోమవారం ఉదయం బయలుదేరి వెల్లనున్నారు.

ఉచిత శిక్షణ

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని శ్రీసత్యసాయి సేవా సంస్థలు, రైల్వే ఏరియా సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సమితి సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఇంజినీరింగ్, అగ్రికల్చరల్, ఫార్మసీ కోర్సుల ప్రవేశ పరీక్షకు ఐసీడబ్ల్యూఏఐ భవన్ పక్కన, అక్కయ్యపాలెం హైవే వద్ద గల సత్యసాయిబాబా సాయిసౌధలో కోచింగ్ ఉంటుందన్నారు. ఈ నెల 10 నుంచి మే 13 వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com